ఆంధ్రజ్యోతి

andhrajyothy.com సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 32.3 | కనిష్ఠం 22.9




నిజామాబాద్
జిల్లా వార్తలు

5 మంగళవారం 17 సెప్టెంబరు 2024

నేడు మద్యం దుకాణాలు బంద్

ఖిల్లా, సెప్టెంబరు 16: గణేష్ ఉత్సవాల అనంతరం మంగళవారం జరిగే గణేష్ నిమజ్జన శోభాయాత్రలో భాగంగా మద్యం దుకాణాల అమ్మకాలపై ఆంక్షలను విధిస్తున్నట్లు సీపీ కల్మేశ్వర్ సింగెనవార్ తెలిపారు. మద్యం దుకాణాదారులు, కల్లు డిపోలు, బార్‌ల నిర్వాహకులు మంగళవారం ఉదయం 6గంటల నుంచి బుధవారం 10గంటల వరకు వ్యాపార లావాదేవీలను కొనసాగించరాదని తెలిపారు. శోభాయాత్రలో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసు శాఖకు మద్యం వ్యాపారస్థులు సహకరించాలని ఆయన కోరారు.



- తిరగబడ్డ ఇందూరు గడ్డ
- నిజాం పాలనకు వ్యతిరేకంగా ఉద్యమం
- విమోచనోద్యమంలో మోర్తాడ్ పోరాట వీరులు
- సాయుధ పోరాటంలో ఉమ్మడి జిల్లా ప్రముఖులు
- నేడు తెలంగాణ విమోచన దినం

• మోర్తాడ్ బురుజు ఇదే..

• 15ఏళ్లు జైలు శిక్ష అనుభవించిన అంబల్ల నర్సింహులు

• రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడిన సోషలిస్టు లింబగిరి

సామాన్యులే సాయుధులై..

తెలంగాణ సాయుధ పోరాటంలో ఇందూరు బిడ్డలు

దేశ చరిత్రలో మహోజ్వల ఘట్టం.. తెలంగాణ సాయుధ పోరాటం. రాచరికం, భూస్వామ్య వ్యవస్థ, మతోన్మాదంపై ఏకకాలంలో సాగిన ఉమ్మడి సమరమది. నిజాం నిరంకుశానికి... భూస్వాముల అరాచకానికి, రజాకార్ల రాక్షసకాండకు వ్యతిరేకంగా జరిగిన ఉధృత సాయుధ పోరాటమిది.. సామాన్యులే సాయుధులై చేసిన ప్రతిఘటన ఇది.

మోర్తాడ్, సెప్టెంబరు 16: బానిస బతుకుల విముక్తి కోసం రజాకార్ల అకృత్యాలకు విసిగి వేసారిన ప్రజలు నిజాం ప్రభుత్వాన్ని రద్దుచేసేందుకు చేపట్టిన తెలంగాణ సాయుధ పోరాటంలో ఉమ్మడి నిజా మాబాద్ జిల్లా చరిత్ర ఎంతో ఘనమైనది. ఎంతో మంది సాయుధ పోరాట యోధులు తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొని నైజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమించారు. నిజాం నవాబు కర్క శపాలనకు చరమగీతం పాడేందుకు దేశ స్వాతం త్ర్యం కోసం అగ్రబాగాన నిలిచి పోరాడిన ఇందూరు బిడ్డలు తమ పేరును చరిత్ర పుటల్లోకి సువర్ణ అక్షరాలతో లిఖించుకున్నారు.

రజాకార్లకు ఎదురొడ్డిన మోర్తాడ్ వాసులు

తెలంగాణ విమోచనోద్యమంలో నిజాంకు వ్యతిరేకంగా పోరాడి జైలు శిక్ష అభినుభవించిన వారిలో అత్యధికులు జిల్లాలోని మోర్తాడ్ ప్రాంత వాసులే కావడం గమనార్హం. మోర్తాడ్‌కు చెందిన సోషలిస్టు లింబగిరి దుత గంగారాంలు రాజకార్లకు ఎదురొడ్డి పోరాడారు. ఇందులో భాగంగానే పెద్ద ఎత్తున యువకులను సమీకరించి కర్రసాము నేర్పించారు. ఈ ప్రాంతానికి చెందిన చౌట్‌పల్లి హన్మంత్ రెడ్డి కూడా విమోచన ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. ఉద్యమానికి ఆర్థిక సహాయం చేసి ప్రజల మన్ననలు అందుకున్నారు. పాలెం గ్రామానికి చెందిన బద్దం చిన్నారెడ్డి విమో చన ఉద్యమంలో కీలకపాత్ర పోషించారు. 1947లో హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర విమోచన దినోత్సవంలో పాల్గొని జైలు శిక్ష అనుభవించారు. చిన్నారెడ్డి సేవలకు గుర్తిం పుగా 1973లో ప్రభుత్వం తామ్రపత్రం ఇచ్చి ఆయనను సన్మానించింది. తెలంగాణ విమోచన ఉద్యమంలో రాజకార్లతో పోరాడిన వారిలో మోర్తాడ్ మండలానికి చెందిన రాజమల్లారెడ్డి (మోర్తాడ్), ముస్కు నారాయణరెడ్డి((సుంకెట్), బోగ చిన్నయ్య, అంబల్ల నర్సింలు, తిరుపతి రామనుజం, రిక్క గంగారాం, సడాక్ రాములు వీరందరు మో ర్తాడ్ వాసులే. లోక గోపాల్‌రెడ్డి(దర్మోరా), శెట్‌పల్లికి చెందిన నాయి బాలయ్య, రాజలింగం, బద్దం లింగారెడ్డి, నాయి సాయన్న ఉన్నారు. ఇలా ఉద్యమంలో పాల్గొని త్యాగాలు, బలిదానాలు చేసి చరిత్ర పుటల్లో ఎక్కిన వారు కొందరైతే చరిత్రకు అందని వారు మరెందరో ఉన్నారు. నాటి స్వాతంత్ర్య ఉద్యమంలో, మొన్నటి విమోచన ఉద్యమంలో 1969ప్రత్యేక ఉద్యమంలో అగ్రభాగాన ఉండి ప్రాణత్యాగాలు చేసిన త్యాగాల గడ్డ మోర్తాడ్ చరిత్రలో తనకు ఒక పేజి కేటా యించుకుంది.

అంబల్ల నర్సింహులుపై జంగ్ మహబూబ్ దాడి

నిజంపాలనకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న రోజులలో మోర్తాడ్‌కు చెందిన ఆర్యసమాజ్ నాయకుడు కొండా లక్ష్మ ణ్ బాపూజీ అనుచరుడు అంబల్ల నర్సింహులును హత్య చేయాలని జంగ్ మహబూబ్ అనే వ్యక్తి కత్తితో దాడి చేశాడు. అంబల్ల నర్సింహులు ఆధ్వర్యంలో అనుచరులు నిజాంకు వ్యతిరేకంగా రజాకార్లను ఎదుర్కొనేందుకు కర్ర సాములను యువకులకు నేర్పించే వారు. దీనిని జీర్ణించుకోలేని ముస్లింలు అంబల్ల నర్సింహులును చంపాలని మహాదేవుని గుడి వద్ద కత్తితో దాడి చేశాడు. నర్సింహులు తప్పించుకునేందుకు చెయ్యి అడ్డు పెట్టగా చెయ్యిపై కత్తితో గాయపరిచారు. ఈ విషయం తెలిసి నర్సింహులు అనుచరులు బోగ చిన్నయ్య, సడాక్ రాములు, కర్రలతో పరుగెత్తుకొని రావడంతో దాడి చేసిన జంగ్ మహబూబ్ పారిపోయాడు. అంబల్ల నర్సింహులు వెంటనే దేశ్‌ముక్ గడ్డం గంగారెడ్డి తన వాహనంలో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. జంగ్‌మహబూబ్‌పై వేసిన కేసును స్వాతంత్ర్య సామరయోధుడు కొండా లక్ష్మణ్‌బాపూజీ వాదించారు. ఇదే కేసును స్థానిక దేశ్‌ముఖ్ రాజేశ్వర్‌రెడ్డి కూడా వాదించారు. చివరకు అంబల్ల నర్సింహులుకు జైలు శిక్ష పడడంతో నిజామాబాద్‌లోని ఖిల్లా జైలుకు తరలించారు. అదే సమయంలో 15నెలలు జైళ్లో ఉండి పోలీసు చర్య జరగడంతో ఆయన విడుదల అయ్యారు. నిరంకుశ పాలకు వ్యతిరేకంగా పోరాడిన చరిత్ర మోర్తాడ్ వాసులదే.

ఝూన్సీలక్ష్మీబాయికి సమకాలికుడు రాజారుక్మారెడ్డి

మోర్తాడ్ జమిందర్‌కు కొంత సైన్యం పీరంగులు, గోల్కొండ నవాబు తానిషా పాలనలో ఈయన జమీందారులుగా కొనసాగారు. మోర్తాడ్ జమీందర్ కింద 50 కిపైగా గ్రామాలు ఉండేవి. 1957లో నిజం కర్కశ పాలనలో ఉంటూ బ్రిటిష్ సామ్రాజ్యాన్ని కూలదొయ్యడానికి తొలి భారత స్వాతంత్ర్య పోరాటం లో కీలకపాత్ర పోషించిన జమీందర్ గడ్డం రుక్మారెడ్డి మోర్తాడ్ వాస్తవ్యులే. 1830లో జన్మించిన రుక్మారెడ్డి ప్రథమ స్వాతంత్ర్య ఉద్యమ నాయకురాలు ఝూన్సీ లక్ష్మీబాయికి సమకాలికులు. 30ఏళ్ల వయస్సులో కౌలాస రాజు దిలిప్‌సింగ్‌తో కలిసి మహారాష్ట్రలో ఎన్నో పోరాటాలు చేశారు. ఈ క్రమంలోనే బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా రుక్మారెడ్డితో పాటు పోరాడిన కౌలాసరాజు జమిందరీ తనం కోల్పోయారు. అప్పటి స్వాతంత్ర్య పోరాటంలో కీలకపాత్ర పోషించిన రుక్మారెడ్డిని కఠినంగా శిక్షించాలంటూ బ్రిటిష్ ప్రభు త్వం నిజం నవాబుకు ఆదేశించింది. దీంతో రుక్మారెడ్డిని ఇనుప సంకెళ్లతో బంధించి అనేక రకాలుగా హింసించారు. అంతటితో ఆగకుండా రుక్మారెడ్డి తండ్రి జమీందర్ నర్సింహారెడ్డి ఆధీనంలో ఉన్న భూములు, గ్రామాలను నిజాం ప్రభుత్వం తగ్గించింది. ఎట్టకేలకు నిజం ప్రభుత్వం రుక్మారెడ్డిని వృద్ధా ప్యంలో విడుదల చేసింది. అప్పటి వరకు ఆయన జైల్లోనే దుర్భర జీవితాన్ని అనుభవించారు.

పులిపిరి ఆకు పసరుతో మటుమాయం

నిజామాబాద్ జిల్లా : అందమైన శరీరంపై పులిపిర్లు వచ్చి ఎంతగానో చింతిస్తున్నారా? అయితే ఇప్పుడు ఆ దిగులు అవసరం లేదు అంటున్నాడు మన సేవా రత్న, విశిష్ట పురస్కారం అవార్డ్ అందుకున్న వడియార మల్లిఖార్జునుడు.



వైద్యానికి దారి తీసిన విధానం

గతంలో ఈ మల్లికార్జునరావు ఒక వైద్యుని దగ్గర సహాయకుడు. అతనికి పులిపిర్లు అధికంగా వుండేవి. సదరు వైద్యులను సంప్రదించినా ఫలితం లేదు కదా అవి ఇంకా వృద్ధిచెందేవి. తీరా శ్రీశైలం అడవులనందు ఎవరో వైద్యుడు ఈ పులిపిర్లకు వైద్యం అందిస్తున్నారు అని తెలిసింది. త్వరితగతిన అక్కడికి వెళ్లగా పులిపిర్లు మటుమాయం. ఆ క్షణం నుండి ఈ మల్లికార్జునుడు శ్రీశైలంలోని ఆ పులిపిర్ల వైద్యుని వెంటపడి తను కుదరదు అన్న వినకుండా అన్నిరకాలుగా ఈ వైద్యాన్ని అవపాసన పట్టించాడు. తన గురువుగారు తనువు చాలించాక ఇప్పుడు తన శిష్యుడైన ఈ మల్లి అదే వైద్యాన్ని కొనసాగిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా తన వైద్య సేవలు అందిస్తున్నాడు.

17, 18, 19, తేదీల్లో నిజామాబాద్ జిల్లా, హోటల్ హరిత ఇందూర్, పంచవటి మెగామార్ట్ పైన, రైల్వే స్టేషన్ ఎదురుగా, నిజామాబాద్ నందు వైద్యం. ఒక్క చిన్న పులిపిరికి కేవలం రూ.100/- మాత్రమే, పెద్దపులిపిరికి (**సైజును బట్టి చార్జి చేయబడును). ఈ పులిపిరి వైద్యం షుగర్ వ్యాధి ఉన్నవారు కూడా చేయించుకోవచ్చును.** ఉదయం 9.00 గం. నుండి సాయంత్రం 6 గం. వరకు ఈ వైద్యసేవలు అందించబడును. అపాయింట్‌మెంట్స్ కొరకు ఫోన్ నం.: **9849628485**ను సంప్రదించగలరు. ఒక వేల ఈ క్యాంపుకు రాలేక పోయినవారు **హైదరాబాద్‌లోని బాలాపూర్‌లో** గల మా క్లీనిక్ లో వచ్చి వైద్యం చేయించుకోగలరు ఫోన్ నం. **9440251969** మరిన్ని వివరాలకు youtube: pulipiri mallikarjun లో చూడండి

మల్లి చేతిలో దివ్యమైన మూలికలు

సాధారణంగా 7 రకాలుగా కనిపించే ఈ పులిపిర్లు మనిషి శరీరంపై ఎక్కడైనా రావచ్చు. "హ్యూమన్ పాపిలోమా వైరస్" కారణం ద్వారా మరియు వంశపారంపర్యంగా కూడా ఈ పులిపిర్లు రావచ్చు. అయితే ఏ రకమైన పులిపిరినైనా సరే తను సేకరించిన పొడిని తడిపిన దూదితో పులిపిరిపై అద్ది మరుక్షణం కట్‌చేస్తాడు. అనంతరం అదే పొడిని మరలా తీసిన ప్రదేశంలో అద్దుతాడు. అంతే వైద్యం అయిపోయింది. తన 27 సం॥ల అనుభవంతో సామాన్యుల నుండి ప్రముఖులు కొన్ని వేల మంది ఈ వైద్య సేవలు పొందారు. ఈ వైద్యం మనకు అందుబాటులో వుండటం మనం గర్వించదగ్గ విషయం.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు, సీపీ కల్మేశర్

'ప్రజాపాలన'కు కలెక్టరేట్ ముస్తాబు

• ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, సీపీ

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 16: రాష్ట్ర ప్రభుత్వం అట్టహాసంగా నిర్వహించ తలపెట్టిన ప్రజా పాలన దినోత్సవ వేడుకకు కలెక్టరేట్ ముస్తాబైంది. మంగళవారం నిర్వహించనున్న ఈ వేడుకల కోసం అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ అనిల్ ఈరవత్రి ముఖ్య అతిథిగా హాజరై ఉదయం 10గంటలకు జాతీయ జెండాను ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించనున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రముఖులు ఈ వేడుకల్లో పాల్గొనే అవకాశం ఉన్న నేపథ్యంలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా పకడ్బందీ ఏర్పాట్లను చేశారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, సీపీ కల్మేశ్వర్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, తదితరులు సోమవారం ప్రజాపాలన దినోత్సవ ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వేదిక, ఇతర ఏర్పాట్లను పరిశీలించి సంబంధిత శాఖ అధికారులకు పలు సూచనలు చేశారు. ఎక్కడ కూడా ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట అదనపు డీసీపీ కిషన్, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



డయల్ 100కు రాంగ్ కాల్స్ చేస్తే చర్యలు

- పోకిరీల ఆటలకు అడ్డుకట్ట వేస్తున్న పోలీసులు
- వారంలో ముగ్గురిపై కేసులు

ఖిల్లా, సెప్టెంబరు 16: కొందరు పోకిరీల వల్ల డయల్ 100కాల్ వృథా అవుతోంది. మద్యం మత్తులో అవసరం ఉన్నా.. లేకపోయిన డయల్ 100కు కాల్ చేసి పోలీసులను ఆటపట్టిస్తున్నారు. రాంగ్‌కాల్స్‌తో పోలీసులకు ఇబ్బంది పెడ్తున్న పోకిరీల ఆటలకు అడ్డుకట్ట వేస్తున్నారు. వరుస కేసులతో పోకిరీల్లో భయం కల్పిస్తున్నారు. రాంగ్‌కాల్ చేసిన వారిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపుతున్నారు. ఇటీవల ఇటువంటి ఘటనలు జిల్లాలో తరచూ జరుగుతున్నాయి. వీటిని దృష్టిలో పెట్టుకుని సాంకేతిక పరిజ్ఞానంతో పోలీసు శాఖ డయల్ 100కు కాల్ చేసి పోలీసుల సహనాన్ని, సయమాన్ని వృథా చేసే వారిని గుర్తించి వారి పనిపడుతున్నారు. దొరికిన వారిని దొరికినట్లుగా కోర్టుకు హాజరు పర్చుతున్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే డయల్ 100 కాల్‌తో ఆటలాడి పోలీసుల విధులకు ఆటంకాలు పెడ్తున్నారని కోర్టుకు నివేదిస్తున్నారు. దీంతో వారికి కోర్టు జైలు శిక్ష విధిస్తుంది. వారం రోజుల్లో జిల్లాలో తప్పుడు సమాచారంతో పోలీసులకు తప్పుదోవ పట్టించడానికి మూడు డయల్ 100కాల్ చేసిన ఘటనలు మూడు జరిగాయి. వీరిని కోర్టుకు హాజరు పర్చగా కోర్టు వారిని రెండు రోజుల జైలు శిక్ష విధించింది. గత నాలుగు రోజుల కితం జిల్లా కేంద్రం లోని ఆర్అర్ చౌరస్తా వద్ద ఓ వ్యక్తి మద్యం మత్తులో ఉండి తనవద్ద సెల్‌ఫోన్ లేకున్నా ఇతరుల సెల్‌పోన్ తీసుకుని డయల్ 100కు కాల్ చేసి పోలీసులను ఇబ్బంది పెట్టాడు. ఆ వ్యక్తిని గుర్తించిన పోలీసులు కోర్టు ఎదుట హాజరు పర్చగా ఆయనకు రెండు రోజుల జైలు శిక్ష విధించింది. అదే విధంగా తాజాగా గురువారం ధర్పల్లి మండలం డీటీ తండాకు చెందిన గుగులోత్‌అనిల్, సీతాయిపేట్‌కు చెందిన చెప్యాలబాబు, సుంచపు రాజులకు నిజామాబాద్ సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ న్యాయమూర్తి రెండురోజుల పాటు జైలు శిక్ష విధించింది.

ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించేందుకు రాష్ట్ర పోలీసు శాఖ డయల్ 100కాల్ అమలు చేస్తుంది. దీనిని మొదలు పెట్టిన అప్పటి రోజుల్లో కొందరు పోకిరీలు అత్యవసరం లేకున్నా డయల్ 100కు కాల్ చేసి పోలీసులను ఆటపట్టించేవారు. కాల్ రాగానే పోలీసులు కాల్ వచ్చిన చోటకు హుటాహుటిన బయల్దేరేవారు. అక్కడికి వెళ్లి కాల్ వచ్చిన సెల్‌ఫోన్ గురించి వాకబు చేయగా చాల సమయాల్లో సెల్‌ఫోన్లు స్విచ్‌ఆఫ్ చేసి ఉండేవి. దీంతో పోలీసులు ఉసురుమంటూ తిరిగి పోలీసు స్టేషన్‌కు వెళ్లిపోయేవారు. ఇలా జరుగుతున్నందున పోలీసు శాఖ ఉన్నతాధికారులు పత్రిక ప్రకటనలు ఇచ్చి ప్రజలకు అవగాహన కల్పించేవారు. అత్యవసరం ఉంటే కాని డయల్ 100కాల్‌ను వినియోగించ వద్దని హెచ్చరికలు జారీచేసేవారు. ప్రతి సోమవారం డయల్ యువర్ ఎస్పీ కార్యక్రమంలో పోలీసు బాస్ ప్రజలకు డయల్ 100గురించి వివరించేవారు. ఇలా చేయడం వల్ల ప్రజలు, పోకిరీలు డయల్100కు కాల్ చేయడం మానివేశారు. అత్యవసరం ఉంటేగాని డయల్ 100కు కాల్ చేసే వారు కారు. కానీ ప్రస్తుతం తిరిగి పాత పద్ధతికి యువకులు, మద్యం ప్రియులు, ప్రజలు రాంగ్‌కాల్స్ చేయడం ప్రారంభించారు.


సాంకేతిక పరిజ్ఞానం ద్వారా గుర్తింపు..

పదేళ్ల కిత్రం అంతగా సాంకేతిక లేకపోవడంతో డయల్ 100కాల్ ద్వారా పోలీసులకు ఆటపట్టించిన తప్పించుకుని తిరిగేవారు. పైగా ఇలా చేసినందుకు పైశాచిక ఆనందం పొందేవారు. కానీ ప్రస్తుతం మారిన సాంకేతిక పరిజ్ఞానం వల్ల పోలీసు శాఖ డయల్100ను దుర్వినియోగం చేసే వారిని ఎప్పటికప్పుడు గుర్తించి ఎక్కడి నుంచి కాల్ వచ్చింది, ఎవరు చేశారు అని ఆరా తీసి వారి సెల్ ఫోన్ నంబర్ ఆదారంగా పట్టుకుని కోర్టు ఎదుట హాజరు పర్చుతున్నారు. ఇలా చేయడం వల్ల పోకిరీలకు శిక్షతో పాటు డయల్100 దుర్వినియోగం కాకుండా ఉంటుందని భావిస్తున్నారు.

డయల్ 100ను దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు..

:రాజావెంకట్‌రెడ్డి, ఏసీపీ (నిజామాబాద్)

డయల్ 100 కాల్స్‌ను దుర్వినియోగం చేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించేందుకు అమలు చేస్తున్న డయల్ 100ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి. అత్యవసర సమయాల్లో రక్షణ నిమిత్తం డయల్ 100ను వినియోగించుకోవాలి. డయల్ 100ను దుర్వినియోగం చేసిన వారిని గుర్తించి కేసులు పెట్టడం జరుగుతుంది.



కాంగ్రెస్ సీనియర్లకు పదవులు

- నామినేటెడ్, పార్టీ పదవులను ఇచ్చేందుకు కసరత్తు
- రాష్ట్రస్థాయి చైర్మన్‌లతో పాటు జిల్లా, నగర కాంగ్రెస్ అధ్యక్షుల నియామకానికి ఏర్పాట్లు

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 16: కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత జిల్లాకు చెందిన సీనియర్ నాయకులకు రాష్ట్రస్థాయి పదవులు దక్కుతున్నాయి. పదేళ్ల కాలంలో కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉండగా పార్టీ కోసం పనిచేసిన నేతలకు అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రస్థాయి చైర్మన్ పదవులను ఇచ్చారు. తాజాగా రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా మహేష్‌కుమార్‌గౌడ్ నియామకం కావడంతో జిల్లాలో పార్టీకి రాష్ట్రస్థాయి పదవి వచ్చినట్లయింది. మొదటి విడతలో రాష్ట్రస్థాయి చైర్మన్‌లుగా ప్రస్తుత డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, సీనియర్ నాయకుడు తాహెర్ బిన్ హందాన్, మాజీ విప్ అనిల్‌తో పాటు రాష్ట్ర కిసాన్ చైర్మన్ అన్వేష్‌రెడ్డిలు నియామకం అయ్యారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా నామినేటెడ్ పోస్టులకు బ్రేక్ పడగా తాజాగా మళ్లీ ప్రభుత్వం నామినేటెడ్ పోస్టుల భర్తీకి కసరత్తును ప్రారంభించింది. త్వరలో మంత్రివర్గ విస్తరణ ఉండే అవకాశాలు ఉండటంతో బోధన్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డికి మంత్రి వర్గంలో చోటు లభించే అవకాశం ఉంది. అలాగే కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా పనిచేస్తున్న మానాల మోహన్ రెడ్డికి రాష్ట్ర సహకార సంఘాల అధ్యక్షుడిగా నియమించగా, నగర కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేస్తున్న కేశవేణుకు నుడా చైర్మన్‌గా నియమించే అవకాశాలు ఉం డటంతో ఆ రెండు పార్టీ పదవులకు కొత్తవారిని నియమించేందుకు పార్టీ కసరత్తు చేస్తోంది.

చైర్మన్ల రేసులో గడుగు, శేఖర్‌గౌడ్‌లు..

జిల్లాకు చెందిన సీనియర్ నాయకులు గడుగు గంగాధర్, శేఖర్‌గౌడ్‌లకు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్ పదవులు వచ్చే అవకాశాలు ఉన్నాయి. జుక్కల్ టిక్కెట్‌ను ఆశించి చివరి నిమిషంలో నిరాశకు గురైన గడుగుకు రాష్ట్రస్థాయి చైర్మన్ పదవి వచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలిసింది. రూరల్ నియోజకవర్గానికి చెందిన డీసీసీ డెలిగేట్ శేఖర్‌గౌడ్ కూడా రాష్ట్రస్థాయి చైర్మన్ రేసులో ఉన్నారు. మహేష్‌కుమార్‌గౌడ్‌కు అత్యంత సన్నిహితుడిగా ముద్రపడ్డ శేఖర్‌గౌడ్‌కు రాష్ట్రస్థాయి చైర్మన్ పదవి వచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలిసింది. అదే విధంగా రూరల్ టికెట్ ఆశించిన నగేష్‌రెడ్డికి సైతం రాష్ట్రస్థాయిలో పార్టీ పదవి లేదా కార్పోరేషన్ చైర్మన్‌గా నియమించే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటి కే నుడా చైర్మన్‌గా నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కేశవేణును ఖరారు చేసినట్లు ప్రచారం జరుగుతుండగా నుడా చైర్మన్ పదవి ఆశించిన సీనియర్ నేతలు అంతి రెడ్డి రాజరెడ్డి, నరాల రత్నాకర్‌ల కు ఏదోఒక పదవి ఇచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. అంతి రెడ్డి రాజరెడ్డికి గ్రంథాలయ చైర్మన్ పదవి ఇస్తున్నట్లు ప్రచారం జరుగుతుండగా నరాల రత్నాకర్‌కు రాష్ట్రస్థాయి చైర్మన్ లేదా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా నియమించే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. మహేష్‌కుమార్‌గౌడ్ ముఖ్య అనుచరుడు అయిన రాంభూపాల్ సైతం గ్రంథాలయ చైర్మన్ పదవిని ఆశిస్తున్నారు. నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ముప్ప గంగారెడ్డిని ఖరారు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. శేఖర్‌గౌడ్‌కు రాష్ట్రస్థాయి చైర్మన్ పదవి రాకపోతే శేఖర్‌గౌడ్‌ను మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమించే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

కాంగ్రెస్ జిల్లా, నగర అధ్యక్షులు ఎవరో?

టీ పీసీసీ నూతన అధ్యక్షుడిగా మహేష్‌కుమార్‌గౌడ్ నియామకం కావడంతో రాష్ట్రస్థాయిలో అన్ని జిల్లాల్లో అధ్యక్షులతో పాటు నగర కాంగ్రెస్ అధ్యక్షులు మారే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి రాష్ట్ర సహకార సంఘాల చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించగా, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కేశవేణుకు నుడా చైర్మన్ పదవి వస్తుండటంతో ఆ రెండు పోస్టులకు నూతన అధ్యక్షులను నియమించనున్నారు. సమీకరణల వారీగా జిల్లా పార్టీ అధ్యక్షుడితో పాటు నగర పార్టీ అధ్యక్షుని నియమించేందుకు జిల్లా నేతలు కసరత్తు చేస్తున్నారు. డీసీసీ అధ్యక్షుడిగా శేఖర్‌గౌడ్, నరాల రత్నాకర్, ముత్యాల సునీల్‌రెడ్డి, నగరానికి చెందిన అంతిరెడ్డి రాజరెడ్డి, కౌడపు శరత్‌కుమార్‌ల పేర్లు పార్టీ నేతల పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. నగర అధ్యక్షుడిగా సైతం బొబ్బిలి రామకృష్ణ, రాంభూపాల్, ఇర్ఫాన్ అలీ, జావిద్ అక్రమ్, తదితరుల పేర్లను పార్టీ నేతలు పరిశీలిస్తున్నట్లు పార్టీ శ్రేణుల్లో ప్రచారం జరుగుతోంది. నగర కాంగ్రెస్ అధ్యక్షుడిగా సైతం సీనియర్ నేతను ఎంపిక చేసేందుకు పార్టీ నాయకత్వం ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది.



సిద్దులగుట్టపై ప్రత్యేక పూజలు

పెర్కిట్, సెప్టెంబరు 16: ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్దులగుట్టపై సోమవారం భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి శివాలయంలో పంచామృతల తో అభిషేకాలు చేశారు. అదే విధంగా రామాలయం, దుర్గామాత, దత్త త్రేయ, అయ్యప్ప, ఎల్లమ్మతల్లి ఏకశిల స్తంభం వద్ద హన్మాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నందీశ్వర మహరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పల్లకి సేవలో భజనలు చేస్తూ భక్తిగీతలు పాడుతూ నృత్యాలు చేస్తూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అకట్టుకున్నారు. దూర ప్రాంతాల నుంచి భక్తుల సౌకర్యార్థం కాటేజీల నిర్మాణం కొరకు విరాళాలు ఇవ్వడానికి ఆలయ కమిటీ సభ్యులను సంప్రదించాలని తెలిపారు. భక్తులందరి సహయ సహకారాలతో ప్రతీ సోమవారం అందించే అన్నదాన ప్రసాదంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బి.సుమన్, పీసీ.గంగారెడ్డి, కొడిగెల మల్లయ్య, బోండ్ల ఆనంద్, చరణ్‌రెడ్డి, బట్టు శంకర్, చెందేశీ శ్రీనివాస్, ప్రశాంత్‌గౌడ్, జనార్ధన్‌గౌడ్, కొంతం మురళీ, రామాగౌడ్, సిద్దులగుట్ట సేవ సమితి సభ్యులు పాల్గొన్నారు.



సిద్దులగుట్టపై పల్లకి సేవలో పాల్గొన్న భక్తులు

అథ్లెటిక్స్ పోటీల్లో కస్తూర్బా విద్యార్థుల ప్రభంజనం

భీమగల్, సెప్టెంబరు 16: సౌత్‌జోన్ జూనియర్ అథ్లెటిక్స్ ఓవరల్ ఛాంపియన్‌షిప్‌ను భీమ్‌గల్ కస్తూర్బాగాంధీ పాఠశాల విద్యార్థులు కైవసం చేసుకున్నారు. జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని రాజారాం స్టేడియంలో నిర్వహించిన సౌత్‌జోన్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొన్న కస్తూర్బా పాఠశాల విద్యార్థులు 13మెడల్స్ సాధించి ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి స్వామి, పాఠశాల స్పెషల్ ఆఫీసర్ స్రవంతి, పీఈటీ సువర్ణ, క్రీడాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

మహాగణపతికి 51రకాల నైవేద్యాలు

భీమ్‌గల్‌రూరల్, సెప్టెంబరు 16: భీమ్‌గల్ మండలంలోని పల్లికొండ గ్రామంలో గణేష్ ఉత్సవాల్లో భాగంగా సోమవానం హవా యూత్ ఆధ్వర్యంలో సోమవారం మహాగణపతికి 51 రకాల నైవేద్యాలు సమర్పించారు. ప్రతీ ఏడాది మండపంలో గణపతికి వివిధ రకాల నైవేద్యాలు సమర్పిస్తామని నిర్వాహకులు తెలిపారు. ప్రతీ సంవత్సరం విధంగానే ఈ సారి కూడా సాంస్కృతిక కార్యక్రమాలు, భక్తులకు ప్రతీ రోజు అన్నదానం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హవా యూత్ సభ్యులు పిట్ల రంజిత్, రోహన్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీని సందర్శించిన రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్


మెండోర, సెప్టెంబరు16: శ్రీరాంసాగర్ ప్రాజెక్టును, జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిండుకుండల నిండడంతో ప్రాజెక్టును సందర్శించి ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదనీటి వివరాలను ప్రాజెక్టు ప్రధాన కాలువల ద్వారా నీటి విడుదలను ప్రాజెక్టు అధికారులను అడిగితెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారులు జల విద్యుత్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరా మహిళా శక్తి క్యాంటిన్ ప్రారంభం

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబరు 16: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సి పల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య ఇందిరా శక్తి క్యాంటిన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జర్నలిస్టు కాలనీ సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన క్యాంటిన్ ద్వారా మహిళల ఆర్థికాభివృద్ధికి తోడ్పాడుతుందని, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరా మహిళ శక్తి కార్యక్రమం ద్వారా ప్రజలు మహిళ సంఘాల ద్వారా తయారు చేసే తెలంగాణ పిండి వంటకాలను ప్రోత్సహిస్తూ మహిళ సంఘాల పురోగతికి తోడ్పాడాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజు, బీజేపీ ఫ్లోర్ లీడర్ జీవీనర్సింహరెడ్డి, కౌన్సిలర్‌లు ఆకుల రాము, శాల ప్రాద్, ఫయాజ్, తదితరులు పాల్గొన్నారు.





















బట్టాపూర్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు



బట్టాపూర్‌లో సభ్యత్వం నమోదు చేసుకుంటున్న బీజేపీ నాయకులు

ఏర్గట్ల, సెప్టెంబరు 16: మండలంలోని బట్టాపూర్ గ్రామంలో సోమవారం భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మండల పార్టీ అధ్యక్షుడు ఎలేటి నారాయణ రెడ్డి తెలిపారు. అందులో భాగంగా గ్రామంలోని యువత పెద్ద ఎత్తున సభ్యత్వం స్వీకరించినట్లు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో సభ్యత్వం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు కొండ గణశ్యామ్, ప్రసాద్, తిరుమతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధిలోని 16వార్డు బీజేపీ సభ్య త్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయ కులు, కార్యకర్తలు, ప్రధాని మోదీ అభిమానులు బీజేపీ సభ్యత్వ నమోదు చేసుకున్నట్టు,మొబైల్‌లోని ఆన్‌లైన్ ద్వారా సభ్యత్వ నమోదును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పొల్కం వేణు, సుంకరి రంగ న్న, దొండి ఈశ్వర్, నరేష్, రాము, దీపక్, దయాసాగర్, విఠోభ, తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్‌లో సామాజిక తనిఖీ

ముప్కాల్, సెప్టెంబరు16: మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద సంబంధించిన సామాజిక తనిఖీ ప్రజా వేదిక డీఆర్‌డీవో సాయాగౌడ్ అధ్యక్షతన సోమవారం ముప్కాల్ మండల పరిషత్ ఆవరణలో నిర్వహించారు. 2023-24 సంబంధించిన ఉపాధి హామీ పథకం కింద మండలంలో జరిగిన పనులు, చెల్లింపులకు సంబంధించి గ్రామాల వారీగా ఆడిటింగ్ నిర్వహించినట్టు తెలిపారు. ప్రతీ గ్రామంలో ఉపాధి హామీ పనులు నిర్వహించిన పనిదినాలు, చెల్లింపులు, గ్రామీణ స్థాయిలో ప్రదర్శించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ ఆఫీసర్ నారాయణ, ఎంపీడీవో, ఎంపీవో, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీల్లో జిల్లా బాలికల జట్టు



రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన జిల్లా బాలికల జట్టు

డిచ్‌పల్లి, సెప్టెంబరు 16: ఈ నెల 14నుంచి 16 వరకు నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో 5వ రాష్ట్ర స్థాయి జూనియర్ బేస్ బాల్ ఛాంపియన్ షిప్ పోటీల్లో జిల్లా బాలికల జట్టు నల్గొండ జిల్లా జట్టుపై 11-0 పరుగుల తేడాతో విజయం సాధించింది. బాలుర జట్టు రాష్ట్రజట్టు 3వ స్థానం సాధించింది. జిల్లా జట్టు వరంగల్ జట్టుపై 2-1 తేడాలో విజయం సాధించి తృతీయ స్థానం సాధించినట్లు జిల్లా బేస్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు మధుసుదన్‌రెడ్డి, వినోద్‌లు తెలిపారు. ఈ ముగింపు కార్యక్ర మానికి శ్వేతా, మున్సిపల్ చైర్‌పర్సన్ ఈశ్వర్‌లు క్రీడాకారులకు పతకాలు అందజేశారు. పతకాలు సాధించిన క్రీడాకా రులను వ్యాయమ ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి మల్లేశ్ గౌడ్, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, మర్కంటి గంగామోహన్‌లు అభినందించారు. జిల్లా జట్టు కోచ్ మేనేజర్‌లుగా గంగా మోహన్, నరేశ్, మౌనిక, గంగాధర్‌లు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి యోగా ఛాంపియన్‌షిప్‌లో విశ్వవికాస్ విద్యార్థిని గెలుపు

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 16: 2024-25 సంవత్సరానికి గాను రాష్ట్రస్థాయి యోగా ఛాంపియన్‌షిప్‌లో నగరంలోని గాయత్రీనగర్‌లోగల విశ్వవికాస్ పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న విద్యార్థిని దీక్షిత మొదటి స్థానంలో నిలిచింది. తెలంగాణ యోగా అసోసియేషన్ నిర్వహించిన ఈ పోటీలలో దీక్షిత ఉత్తమ ప్రతిభకనబర్చి మొదటి స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా విద్యార్థినిని మరియు శిక్షణ ఇచ్చిన కోచ్‌ను పాఠశాల కరస్పాండెంట్ అప్పారావు, ప్రిన్సిపాల్ సుస్మితలు సోమవారం అభినందించారు. యువ ప్రతిభావంతుల్ని తయారు చేసేందుకు తమ పాఠశాలలో యోగాతో పాటు క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామని తద్వారా వారు శారీరకంగా, మానసికంగా దృఢంగా మారే అవకాశం ఉంటుందని ప్రిన్సిపాల్ సుస్మిత అన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

వర్ని,సెప్టెంబరు 16: వర్ని మండలం మల్లారం గండిలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మురళి(29)మృతి చెందినట్లు ఎస్ఐ కృష్ణ కుమార్ తెలిపారు. మెండోర మండలం దూద్‌గాం గ్రామానికి చెందిన మృతుడు బిచ్కుంద మండల పరిషత్ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. విధుల నిమిత్తం గల ద్విచక్ర వాహనంపై తన భార్య స్వప్నతో కలిసి వెళ్తుండగా మల్లారం గండిలో ఎదురుగా వస్తున్న డీసీఎం వాహనం ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు చెప్పారు. ప్రమాదంలో స్వప్నకు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. డీసీఎం వ్యాన్ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

'ఇచ్చిన హామీలు అమలు చేస్తున్న కాంగ్రెస్‌దే'

బోధన్‌రూరల్,సెప్టెంబరు 16: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని టీపీసీసీ డెలిగేట్ గంగా శంకర్ అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో పీసీసీ అధ్యక్షులుగా నియమితులైన మహేష్ కుమార్ గౌడ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్చం అందజేసి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దాలను అమలు చేస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు నాగేశ్వర్ రావు, మందర్నా రవి, పాషా మొయినోద్దీన్, హరికాంత్ చారి, తలారి నవీన్, మాజీ మున్సిపల్ ఛైర్మన్,కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ కార్యదర్శిగా శ్యామ్

సుభాష్‌నగర్, సెప్టెంబరు 16: రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ సంయుక్త కార్యదర్శిగా జిల్లా బాల్ బ్యాడ్మింటన్ కార్యదర్శి బి.శ్యామ్ ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో సంయుక్త కార్యదర్శిగా శ్యామ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్‌లో ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తూ బాల్ బ్యాడ్మింటన్ క్రీడకు కృషి చేస్తున్న శ్యామ్‌ను రాష్ట్ర కార్యవర్గంలో చోటు కల్పించారు. సంయుక్త కార్యదర్శిగా ఎన్నుకోవడం పట్ల అధ్యక్షులు మానస గణేష్, క్రీడా సంఘంనాయకులు విద్యాసాగర్‌రెడ్డి, నర్సయ్య, కిషన్, రాజ్ కుమార్, రాజేశ్వర్, నాగేష్, కృష్ణమూర్తి, సురేష్‌లు హర్షం వ్యక్తం చేశారు.

లక్ష్మీనారాయణ మందిరంలో చక్రీ భజన

పెర్కిట్, సెప్టెంబరు16: పట్టణంలోని గోల్‌బంగ్లా లక్ష్మీనారాయణ మందిరంలో సోమవారం గణేష్ ఉత్సవాల్లో భాగంగా చక్రీ భజన్ కార్య క్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పెద్దలు,యువతి,యువకులు, పిల్లలు పాల్గొని భజనలు చేస్తూతన్మయత్వం పొందారు.సనాతన ధర్మాన్ని భవిష్యత్ తరాలకు అందించేమంచి కార్యక్రమంగా భక్తులు అన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

ముప్కాల్, సెప్టెంబరు16: బాల్కొండ మండల కేంద్రానికి చెందిన జింగిడి దీక్షిత అనే చిన్నారికి గుండెలో హోల్‌పడి చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ వైద్యఖర్చుల నిమిత్తం రూ.5వేల ఆర్థిక సహాయం కాంగ్రెస్ పార్టీ నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సునీల్ యువసేన నాయకులు, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మిలాద్-ఉన్-నబి

● భారీ ఎత్తున ర్యాలీ ● ప్రసంగించిన మత పెద్దలు ● పోలీసుల భారీ బందోబస్తు



నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



బోధన్‌లో మిలాద్ ఉన్ నబి ర్యాలీ దృశ్యం

నిజామాబాద్ కల్చరల్, సెప్టెంబరు 16: ముస్లింలు పరవ పవిత్రంగా భావించే మిలాద్-ఉన్-నబిని భక్తి శ్రద్దలతో జరుపుకున్నారు. జిల్లా వ్యాప్తంగా ముస్లింలు మిలాద్ ఉన్ నబీని పురస్కరించుకొని ర్యాలీలు నిర్వహించారు. ఉదయం నుంచి ప్రారంభమైన ర్యాలీలు మధ్యాహ్నం వరకు సాగాయి. ర్యాలీలో ముస్లింలు మహమ్మద్ ప్రవక్తను గుర్తు చేస్తూ భక్తి గీతాలు ఆలపిస్తూ ర్యాలీని నిర్వహించారు. అనంతరం నెహ్రూ పార్క్ వద్ద ఏర్పాటు చేసిన వేదికపై మత పెద్దలు మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త (స.అ) సూచించిన విధానాలను అమలు చేయాలని తెలిపారు. ఆయన అడుగు జాడల్లో నడవాలని చెప్పారు. ప్రపంచ శాంతి కోసం మహమ్మద్ ప్రవక్త కృషి చేశారని ఆయన సేవలను కొనియాడారు. ముస్లింలు మహమ్మద్ ప్రవక్త చెప్పినటువంటి మార్గంలో నడుచుకుంటూ ప్రతీ రోజు ఐదు మార్లు నమాజ్‌తో పాటు ఖురాన్‌ను పఠించాలని సూచించారు. ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో సమస్యలు ఉన్నాయని వాటిని తీర్చదానికి ప్రతీ ముస్లీం కట్టుబడి సమస్యను తీర్చడానికి కృషి చేయాలని అన్నారు. అల్లా ప్రపంచ శాంతి కోసమే మహమ్మద్ ప్రవక్తను ఈ భూమి మీదికి పంపించాడని శాంతి, ప్రేమ, త్యాగమే ముస్లీంల ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మత పెద్దలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బోధన్‌రూరల్: మహ్మద్ ప్రవక్త చూపిన అడుగు జాడల్లో మైనారిటీలు నడవాలని మిలాద్ ఉన్ నబి కమిటీ ప్రతినిధులు అలీమొద్దీన్ అన్నారు. సోమవారం బోధన్ పట్టణంలో మహ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా పట్టణంలోని పలు వీధుల గుండా అంబేద్కర్ చౌరస్తా వరకు మైనారిటీలు ర్యాలీ నిర్వహించారు, జలాల్ బుకారి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసి ర్యాలీ పాత బస్టాండ్, రాకాసిపేట్, శక్కర్‌నగర్ అంబేద్కర్ చౌరస్తా వరకు కొనసాగింది. ప్రపంచ శాంతి కోసం మహ్మద్‌ప్రవక్త ఏనలేని కృషి చేశారన్నారు. ముస్లీం సోదరులకు పలువురు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన చూపిన అడుగు జాడల్లో, శాంతి సమాజ స్థాపన కోసం మైనారిటీలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు షేక్.కలీం, మొయిన్ రజా, సమీ, ఆది, ఖలీల్ అహ్మద్, జావీద్, తదితరులు పాల్గొన్నారు.

● పోలీసుల భారీ బందోబస్తు

మిలాద్ ఉన్ నబి ర్యాలీ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. బోధన్ ఏసీపీ శ్రీనివాస్, పట్టణ సీఐ వెంకట్ నారాయణ, కోలా నరేష్‌లు భారీ బలగాలతో మోహరించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ మిలాద్ ఉన్ నబీ, గణేష్ నిమజ్జన ఉత్సవాలను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు.

కోటగిరి: కోటగిరి ఉమ్మడి మండలంలోని కోటగిరి, పొతంగల్, హంగర్గ ఫారం, జల్లాపల్లి ఫారం గ్రామాలలో సోమవారం మిలాల్ ఉన్ నబీ ఉత్సవాలను ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గ్రామాలలో పెద్ద ఎత్తున ర్యాలీలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

డిచ్‌పల్లి: మిలాద్-ఉన్-నబి పురష్కరించుకొని సోమవారం ఇస్లాంపూర్ మసీద్ నుంచి మైనార్టీ సోదరులు శాంతి ర్యాలీ నిర్వహించారు. మౌలాన మోసీన్‌రజా ప్రత్యేక ప్రార్థనాలు చేసి ఈ ర్యాలీ ప్రారంభించారు. మహమ్మద్ ప్రవక్త శాంతి సందేశాన్ని గుర్తు చేస్తూ మైనార్టీలు ప్రార్థనాలు నిర్వహించారు. నడిపల్లి, గాంధీనగర్, మీదుగా ర్యాలీ కొనసాగింది ఈ ర్యాలీలో మైనార్టీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ ర్యాలీకి సీఐ మల్లేశ్ ఎస్సై షరీఫ్‌లు దగ్గరుంచి భద్రత ఏర్పాట్లు పర్యవేక్షించారు.

రుద్రూరు: మహ్మద్ ప్రవక్త పుట్టిన రోజును పురస్కరించుకుని సోమవారం రుద్రూరు మండల కేంద్రంతో పాటు అక్బర్‌నగర్, సులేమాన్‌నగర్ తదితర గ్రామాల్లో ముస్లీం సోదరులు మిలాద్ ఉన్ నబీ వేడుకలను భక్తి శ్రద్దలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా మజీద్‌లలో ప్రత్యేక ప్రార్థనలు చేసి పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ముస్లీం సోదరులకు పలువురు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అదే విధంగా ముస్లీంలు ర్యాలీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమాలలో ముస్లీం ప్రముఖులు మహ్మద్ జహూర్, మహ్మద్ యూనూస్, అరీఫ్, ఖురేషీ షేక్ నిస్సార్, సుబాని, సయ్యద్ తదితర ముస్లీం సోదరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు: అన్వేష్‌రెడ్డి



వరి పంటను పరిశీలిస్తున్న రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి

జక్రాన్‌పల్లి, సెప్టెంబరు16: నసిరకం నాణ్యత లేని నకిలీ విత్తనాలు అమ్మిన, ప్రైవేటు సీడ్ సంస్థల కంపెనీలపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం జక్రాన్‌పల్లిలో రైతులు సాగు చేస్తున్న గింజలు రాని వరి పంటను ఆయన పరిశీలించారు. జక్రాన్‌పల్లి మండలంలో బోజారెడ్డి, ముత్తెన్న, మరికొంత మంది రైతులు సాగు చేస్తున్న మహేంద్ర అండ్ మహేంద్ర ప్రైవేటు సీడ్ కంపెనీ యాజమాన్యం మండలంలో సుమారు 500 ఎకరాలకు మహేంద్ర అండ్ మహేంద్ర సీడ్ కంపెనీ వారు ఈ వరి విత్తనాలు ఇచ్చారన్నారని రైతులు తెలిపారన్నారు. ప్రస్తుతం వరి పంట పెరిగిందని, కానీ ధాన్యం గింజలు రాలేదని, దీంతో రైతులు పంట నష్టపోయమని రైతులు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. ఈ మేరకు రైతుల కోరిక మేరకు మంగళవారం రైతులు సాగు చేస్తున్న ఈ కంపెనీ ఇచ్చిన వరి పంటను పరిశీలించనున్నారు. విత్తనల చట్టంలో మార్పులు రావాలన్నారు. కఠినమైన నిబంధనలు రావాలన్నారు. నాసిరకం, నాణ్యత లేని నకిలీ విత్తనాలు అమ్మిన సీడ్ కంపెనీలపై కఠిన చర్యలు తప్పవన్నారు. రైతులు విత్తనాలు కొనే ముందు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రైవేటు కంపెనీల వారు రైతులను బుజ్జగింజి మోసం చేస్తున్నారని, ప్రైవేటు కంపెనీల వారు ఇచ్చే విత్తనాలను ప్రభుత్వం ధ్రువీకరించడంలేదన్నారు. రైతులు ప్రైవేటు కంపెనీ ద్వారా కాకుండా ప్రభుత్వం విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా రైతులు విత్తనాలు కొనుగోలు చేసుకొని పంటలను సాగు చేసుకోవాలన్నారు. మంగళవారం జక్రాన్‌పల్లి వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు కలిసి రైతులు పండిస్తున్న మహేంద్ర అండ్ మహేంద్ర సీడ్ కంపెనీ వారు ఇచ్చిన వరి పంటను పరిశీలిస్తారన్నారు. అధికారులు పరిశీలించిన తర్వాత నాణ్యత లేదని తెలితే ఆ కంపెనీపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆ కంపెనీ ద్వారా రైతులకు పరిహారం ఇప్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిన్నారెడ్డి, మండల ప్రధానకార్యదర్శి వసంత్‌రావు, మండల యువజన విభాగం అధ్యక్షుడు వినోద్, అర్గుల్, బ్రహ్మణ్‌పల్లి సింగిల్‌విండోల చైర్మన్‌లు ఆర్మూర్ గంగారెడ్డి, కాట్‌పల్లి నర్సారెడ్డి, ఏడీ ప్రదీప్‌రెడ్డి, వ్యవసాయాధికారిణి దేవిక, కాంగ్రెస్ నాయకులు రూపాల గంగారెడ్డి, కుంట భోజన్న, కాట్‌పల్లి నర్సారెడ్డి, జితేందర్‌నాయక్, బాలయ్య, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్‌లో సినిమా షూటింగ్ సందడి



ముప్కాల్‌లో షూటింగ్ తీస్తున్న దృశ్యం

ముప్కాల్, సెప్టెంబరు16: ముప్కాల్ మండల కేంద్రంలో గ్యాంగ్ ఆఫ్ గోపాల్‌పేట్ అనే చిత్రం షూటింగ్ జిల్లా టీయు యుటీఎఫ్ ప్రధానకార్యదర్శి రమేష్ క్లాప్ కొట్టి ప్రారంభించారు. సోమవారం ముప్కాల్‌లోని పడిలేచిన మర్రి చెట్టు దేవస్థానం వద్ద రీల్ రియల్‌మువీ క్రియేషన్ చిత్రనిర్మాణ సారథ్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ చిత్ర నిర్మాణానికి ప్రముఖ తెలంగాణ గేయ రచయిత కోదాడి శ్రీనివాస్ సంగీత దర్శకత్వం వహిస్తున్నా రని, చిత్ర దర్శకుడు మధు, నూతన నటినటులతో గ్రామీణ ప్రాంతాల్లో యువతకు స్పూర్తిగా నిలిచే కథతో సినిమా తీస్తున్నట్టు వారు తెలిపారు. ఈ చిత్రపటాన్ని బాల్కొండ, ముప్కాల్ మండలల్లోని గ్రామీణ ప్రాంతాల్లో చిత్ర షూటింగ్ నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాత సి. ఫణింద్ర, అసోసియేషన్ డైరెక్టర్ సంగీర్‌పాండురంగ, బుక్ డిపో, రామ్‌రాజ్ ఉమేష్, శీను, దశరథ్, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జనోత్సవాన్ని శాంతియుతంగా జరుపుకోవాలి

ముప్కాల్, సెప్టెంబరు16: గణేష్‌మండపాల్లో 11రోజులు పూజలంద రుకున్న గణనాథులను నిమజ్జనోత్సవ కార్యక్రమం శాంతియుతంగా జరుపుకో వాలని ఎస్సై బి.నరేష్ తెలిపారు. సోమవారం బాల్కొండ పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన శాంతి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గణేష్ నిమజ్జనంలో భాగంగా అధిక సౌండ్‌లకు డీజే లకు అనుమతి లేదని, గణేష్ నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు చేసినట్టు వారు తెలిపారు. పోలీస్ బందోబస్తుతో నిర్వహించే నిమజ్జనోత్సవం ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగ కుండా నిర్వహించాలని సూచించారు. ఎలాంటి సమస్యలు ఎదురైనా చట్టపర మైన చర్యలు తీసుకోబడుతాయని అన్నారు. ఈ సమావేశంలో గణేష్ మండపాల నిర్వాహకులు, యువకులు, యువజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

అశోక్ కుటుంబానికి అండగా ఉంటాం

● రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్‌లు అనిల్, మోహన్‌రెడ్డి

మెండోర, సెప్టెంబరు16: అశోక్ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్‌లు ఈరవత్రి అనిల్, మానాల మోహన్ రెడ్డిలు అశోక్ కుటుంబసభ్యులకు ధైర్యామిచ్చారు. సోమవారం మండల కేంద్రానికి చెందిన గాండ్ల అశోక్ ఇటీవల ప్రమాదవశాత్తు కాకాతీయ కాలువలో పడి మృతి చెందడంతో వారి కుటుంబసభ్యులను రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్, మానాల మోహన్‌లు పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీలో అశోక్ చురుకుగా పాల్గొనేవాడని, అశోక్ కుటుంబానికి అండగా ఉంటామని అధైర్యపడవద్దని కుటుంబసభ్యులను ఓదార్చారు. వీరి వెంట మండల అధ్యక్షుడు కొత్తింటి ముత్యంరెడ్డి, వెంకటేష్‌గౌడ్, ముత్యం రెడ్డి, తదితరులు ఉన్నారు.

ఫిలిప్పీన్‌లో వేల్పూర్ యువకుడి మృతి



మృతుడు అక్షయ్

వేల్పూర్, సెప్టెంబరు16: ఫిలిప్పీన్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో వేల్పూర్ మండలానికి చెందిన అక్షయ్ మృతి చెందాడు. అక్షయ్ ఫిలిప్పీన్‌లో ఎంబీబీఎస్ చివరి సంత్సరం చదువుతున్నాడు. మరో ఐదు నెలలో ఎంబీబీఎస్ పూర్తి కావస్తున్న సమయలో అక్షయ్ ఆకస్మిక మృతి అతని కుటుంబంలోని తీవ్ర విషాదాన్ని నింపింది. కాగా గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి.

పచ్చని చెట్లు నేలమట్టం



బడాభీమ్‌గల్ శివారులో విద్యుత్ అధికారులు నరికివేసిన పచ్చని చెట్లు

భీమ్‌గల్‌రూరల్, సెప్టెంబరు16: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటడానికి కోట్లది రూపాయల నిధులు విడుదల చేసి చెట్లు నాటిస్తే వాటిని విద్యుత్ శాఖ అధి కారులు కరెంటు తీగలకు తగులుతున్నాయని నరికివేసుతన్నారు. సోమవారం మండలంలోని బడాభీమ్‌గల్ గ్రామ శివారులో చేంగల్ రోడ్డుకు కొత్తగా కరెంటు స్తంభాలు ఏర్పాటు చేశారు. వాటికి కరెంటు తీగలు లాగడానికి పచ్చని చెట్లు అడ్డువస్తున్నాయని వాటిని విద్యుత్ అధికారులు నరికివేస్తున్నారు. దీనిపై పంచాయతీకార్యదర్శి రజితను వివరణ కోరగా మే ము పంచాయతీ నుంచి ఎటువంటి అనుమతి ఇవ్వలేదన్నారు. రూ.కోట్ల ఖర్చు పెట్టి చెట్లు నాటారు ఎందుకు తర్వాత వాటిని నరకడం ఎందుకాని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పచ్చని చెట్లను నేలమట్టం చేస్తున్న వారిపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూడాలి.

ఆటో బోల్తా బాలుడి మృతి



సంతోష్‌నగర్‌తండా వద్ద బోల్తా పడ్డ ఆటో

భీమ్‌గల్‌రూరల్, సెప్టెంబరు16: మండలంలోని సంతోష్‌నగర్‌తాండా గ్రామ పంచాయతీ పరిధిలో ఆటో బోల్తా పడి సయ్యద్ రియస్(9) బాలుడు మృతి చెందినట్టు ఎస్సై మహేష్ తెలిపారు. ఆయన తెలిసిన వివరాల ప్రకా రం సోమవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో డ్రైవర ఆటో భీమ్‌గల్ నుంచి ఐదుగురిని ఎక్కించుకొని కేసీఆర్ కాలనీకి వెళ్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. ఆటోలో ప్రయాణిస్తున్న బేగం చేతికి గాయాలు అయ్యాయి. మృతుని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకే కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు ఎస్సై తెలిపారు.

సాయుధ పోరాటం కమ్యూనిస్టుల పోరాటమే

పెద్దబజార్, సెప్టెంబరు 16:స్వతంత్ర్య భారతదేశంలో తెలంగాణను కలపాలని సం కల్పంతో నాడు చేసిన సాయుధ పోరాటం కమ్యూనిస్టుల పోరాటమని కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ మార్క్సిస్టు రాష్ట్ర కమిటీ సభ్యులు భోపాల్, రమ అన్నారు. సోమవారం నాం దేవ్‌వాడలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సిపిఎం అఖిల భారత జాతీయ కార్యదర్శి సీతారం ఏచూరి సంతాప సభలో ఆయన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటాలను కమ్యూనిస్టులు చేసిన పోరాటంగా ఆయన అభివర్ణించారు. బిజెపి హిందు, ముస్లీంల మధ్య గొడవలకు ఆజ్యం పోయడం మానుకోవాలని అన్నారు.ఈకార్యక్రమంలో సభ్యులు నూర్జహాన్, శంకర్, సా హెబ్, సుజాత, నాగేశ్వర్‌రావు, నారాయణ, రాములు తదితరులు పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాలకు సహకారం



భీమ్‌గల్‌లో మహమ్మద్ ఇక్రమ్‌అలీ సన్మానిస్తున్న నిర్వహణ సభ్యులు

భీమగల్, సెప్టెంబరు16: పట్టణ కేంద్రానికి చెందిన మహమ్మద్ ఇక్రమ్‌అలీ అనే ముస్లీం యువకుడు గణేష్ ఉత్సవాలలో అన్నదానానికి తనవంతు సహయం చేసి మతసామరస్యానికి ప్రత్యేకగా నిలిచారు. పట్టణ కేంద్రంలోని బోదిరెగల్లీలో మున్నూరుకాపు యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయక మండపం వద్ద సోమవారం ఏర్పాటు చేసిన అన్నదానానికి ముస్లీం యువకుడు రూ.5వేలు అందజేశారు. ఈ సందర్భంగా యూత్ సభ్యులు మహమ్మద్ ఇక్రమ్‌అలీని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బోదిరె నర్సయ్య, పట్టణ యూత్ అధ్యక్షుడు నీలం రవి, సుమన్, నరేష్, గంగాధర్, యూత్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్కెస్ట్రా నిర్వహణపై పోలీసుల సీరియస్

● రుద్రూరులో పది మందిపై కేసు నమోదు

రుద్రూరు, సెప్టెంబరు 16: ఎలాంటి అనుమతులు లేకుండా ఆర్కెస్ట్రా నిర్వహిం చడం పట్ల పోలీసులు సీరియస్ అయ్యారు. ఆదివారం రాత్రి రుద్రూరులో ఆర్కెస్ట్రా కొనసాగుతుందని సమాచారం రావడంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి నిలిపివేయిం చారు. రుద్రూరు మండల కేంద్రంలో పది మందిపై కేసు నమోదు చేశారు. అనుమ తులు లేకుండా ఆర్కెస్ట్రా,రికార్డింగ్ డ్యాన్సులు నిర్వహించార న్నారు. వీరిపై కేసు నమో దు చేసినట్లు ఎస్సై సాయన్న తెలిపారు. అశ్లీల నృత్యాలు చేస్తూ అసభ్యంగా రికార్డింగ్ డ్యాన్సులు చేసినట్లు తెలిసింది.ఈ విషయమై ఎస్సై వివరణ కోరగా మరోసారి ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా చూస్తామని తెలిపారు. అనుమతులు లేకుండాఎవరైనా ఎక్కడైనా ఆర్కెస్ట్రాలను ఏర్పాటు చేస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ సాయన్న పేర్కొన్నారు. నిమజ్జనోత్సవాలను పకడ్బందీగా నిర్వహిస్తున్నామన్నారు

కందకుర్తిలో సోయాపంట పరిశీలన



సోయాపంటను పరిశీలిస్తున్న దృశ్యం

రెంజల్,సెప్టెంబరు 16: మండలంలోని కందకుర్తి గ్రామంలో రైతులు పండించిన సోయాపంటను సోమవారం హైదరాబాద్‌కు చెందిన కలాంతన్ అగ్రికల్చర్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన శాస్త్రవేత్తలు పరిశీలించారు. భారత దేశంలో ఉన్న 22రకాల సోయాబీన్ పంటలను కందకుర్తి గ్రామంలో రైతులు పండించడం జరిగిందని వాటిని పరిశీలించడం జరిగిందని వారన్నారు. 22రకాల సోయాబీన్ పంట రకాలు బాగున్నాయని, వీటి ద్వారా పంట దిగుబడి అధికంగా వస్తుండడంతో రైతులకు అందించే ఉద్దేశంతో డెమో ద్వారా పంటను పరిశీలించడం జరిగిందని రానున్న రోజుల్లో ప్రతి రైతుకు ఈ విత్తనాలు అందించడం జరుగుతుందని అన్నారు ఈ కార్యక్రమంలో ఉస్మాన్, సంజీవ్‌రెడ్డి, షోయబ్ బేగ్,కలీముల్లా హుస్సేన్, హసినోద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఎడపల్లి. సెప్టెంబర్16: ఎడపల్లి మండలంలోని కు ర్నాపల్లి గ్రామ బీఆర్ఎస్ నా యకుడు మాజీ సర్పంచ్ సావిత్రి రవీందర్‌గౌడ్ భర్త రవీందర్‌గౌడ్ గత కొన్ని రోజుల క్రితం స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల్లో భాగంగా విగ్రహానికి పూలమాల వేస్తూ ప్రమాదవశాతు క్రింద పడడంతో గాయపడి చికిత్స పొందుతున్నాడు. సోమవారం మాజీ ఎమ్మెల్సీ విజీ గౌడ్ అతనిని ఆయన నివాసంలో పరామర్శించి వివరాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయనవెంట గౌడ సంఘం నాయకులు రాజాగౌడ్, మధుసూధన్ గౌడ్, శ్రీహరి గౌడ్, ఉత్తమ్ గౌడ్, ఎల్లా గౌడ్, నటరాజ్ గౌడ్ తదితరులు ఉన్నారు.

విద్యుత్ సమస్యలు ఉంటే తక్షణమే సమాచారం ఇవ్వాలి



విద్యుత్ చిహ్నం గల టీషర్టులను ఆవిష్కరిస్తున్న ఏడీఈ, ఏఈలు

ఆర్మూర్‌టౌన్,సెప్టెంబరు16: నేడు పట్టణంలో జరిగే గణేష్ నిమజ్జన కార్యక్రమంలో విద్యుత్ సమస్యలు ఉంటే తక్షణమే సమా చారం అందించాలని విద్యుత్ ఏడీఈ శ్రీధర్, ఏఈ అశ్రితరెడ్డిలు తెలి పారు.ఈ సందర్భంగా విద్యుత్ అధికారులకు టీజీఎన్‌పీడీసీఎల్ చిహ్నం గల వైట్‌కలర్ టీషర్టును సోమవారం వారు ఆవిష్కరించారు. ప్రతీ ఉద్యోగి ఈ టీషర్టును ధరించడంతో సులువుగా తెలుస్తుందని తెలిపారు. పాత ఆర్మూర్‌కు లైన్ ఇన్స్‌పెక్టార్ రవీందర్ సెల్.9493546612, కొత్త ఆర్మూర్‌కు సీతరాములు 9848327500, గోల్‌బంగ్లా నుంచి కాశీహన్మాన్ వీది వరకు ఎల్లయ్య 9550059915, హుస్నాబాద్, చిన్నబజార్, గొమ్ముల వాడ, అరుంధతినగర్‌కు హజర్ 8333994759, రాంనగర్, జిరాయత్ నగర్, శాస్త్రీనగర్‌కు ప్రభాకర్ 9010931869, గాంధీరోడ్, న్యూబస్టాండ్, మహాలక్ష్మీకాలనీకి సంతోష్ 888600 3779, రాజారాంనగర్, యోగేశ్వర కాలనీ, సైదాబాద్, టీచర్స్‌కాలనీలకు రమేష్ 8074415490, హౌసింగ్ బోర్డు, సంతోష్‌నగర్, ఒడ్డెరకాలనీ, రంగచారినగర్‌కు రాంచందర్ 8339 94758, గూండ్ల చెరువు వద్ద బాబుపురావు 9493546615 నెంబర్‌లను సంప్రదించాలని వారు తెలిపారు.

పీఆర్టీయూ జిల్లా కార్యదర్శిగా గంగాధర్



గంగాధర్

ఏర్గట్ల,సెప్టెంబరు16: మండల కేంద్రంలోని ప్రాథమి క పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు సాధుల గం గాధర్ పీఆర్టీయూ జిల్లా కార్య దర్శిగా ఎన్నికైనట్లు పీ ఆర్టీయూ మండల అధ్యక్షుడు కృష్ణప్రసాద్, ప్రధాన కార్యదర్శి రాజేఖర్‌లు తెలిపారు. జిల్లాలో నిర్వహించిన ఎన్నికల్లో 133ఓట్ల భారీ మెజార్టీతో గంగాధర్ గెలు పొందగా, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు దశేంధర్, రాష్ట్ర ఉ పాధ్యక్షుడు భాస్కర్, రాష్ట్రకార్యదర్శిలు అభినందనలు తెలిపారు.

వినాయక నిమజ్జనం ఏర్పాట్ల పరిశీలన

భీమ్‌గల్, సెప్టెంబరు16: భీమ్‌గల్ పట్టణంలోని వినాయక ఉత్సవాల సందర్భంగా విగ్రహాల నిమజ్జనం చేసే చెరువులను సోమవారం మున్సిపల్ కమిషనర్ వై.రామకృష్ణ చైర్మన్ కన్నె ప్రేమలత సురేందర్, సీఐ నవీన్‌కుమార్‌లు పరిశీలించారు. నిమజ్జనం చేసే చెరువు వద్ద తీసుకోవాల్సి జాగ్రత్తలను సిబ్బందికి వివరించారు. చెరువు ప్రాంతంలో లైట్లు ఏర్పాటుతో పాటు గజ ఈతగాళ్లు నియామిస్తున్నామని, భారీ విగ్రహాల కోసం క్రేన్ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఉత్సవాల్లో ఎలాంటి ప్రమాదాలు వాటిల్లకుండా ఉండేలా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వీరి వెంట విద్యుత్ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది శ్రీనివాస్‌రెడ్డి, పల్లికొండ శ్రీధర్, సున్నపు ఓంకార్ ఉన్నారు.

ఆర్టీసీ సేవలను భక్తులు సద్వినియోగం చేసుకోవాలి



బోధన్‌లో అరుణాచలం బస్సును ప్రారంభిస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,సెప్టెంబరు 16: భక్తులు, ప్రజలు సౌకర్యార్థం ఆర్టీసీ ప్రవేశ పెట్టిన సేవలను సద్వినియోగం చేసుకోవాలని బోధన్ ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాస్ అన్నారు. అరుణాచలం బస్సును ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ పౌర్ణమి సందర్భంగా అరుణాచల గిరి ప్రదక్షిణలో భాగంగా సోమవారం నుంచి అరుణాచలం వెళ్లే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సును ప్రారంభించామన్నారు. శిక్షితులైన డ్రైవర్‌లతో సెమీ లగ్జరీ బస్సును ఏర్పాటు చేశామన్నారు. ప్రయాణికులకు సురక్షితమైన ప్రయాణంతో పాటు సమీపం నుంచే సుదూర ప్రాంతాలకు వెళ్లేందుకు కల్పించిన ఈ సదుపాయాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ జానబాయి, ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణికులు ఉన్నారు.

పీఆర్టీయూ నూతన కార్యవర్గం ఎన్నిక



ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 16: పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం 2024-27కు ఆదివారం రాత్రి నిర్వహించిన ఎన్నికల్లో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నగరంలోని బస్వాగార్డెన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడిగా వరుసగా రెండోసారి పొద్దుటూరి మోహన్‌రెడ్డి గెలుపొందగా, ప్రధాన కార్యదర్శిగా గంగోనె కిషన్ గెలుపొందారు. మొత్తం 195 ఓట్లకు గాను 188 పోల్ అవ్వగా అధ్యక్ష పదవికి పోటీ పడిన మోహన్‌రెడ్డికి 137 ఓట్లు రాగా మరో అభ్యర్థి కృష్ణారెడ్డికి 51 ఓట్లు వచ్చాయి. ప్రధాన కార్యదర్శి పదవి కోసం ఎం.వెంకటేశ్వర్‌గౌడ్, శంకర్, గంగోనె కిషన్‌లు పోటీ పడగా కిషన్‌కు 101 ఓట్లు, వెంకటేశ్వర్‌గౌడ్‌కు 35, శంకర్‌కు 50 ఓట్లు వచ్చాయి. అసోసియేట్ అధ్యక్షుడిగా నరేష్, గంట అశోక్, మహిళా అసోసియేట్ అధ్యక్షురాలిగా సరిత, ఉపాధ్యక్షుడిగా చిలుక శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, రఘువీర్, శ్రీనివాస్‌గౌడ్, జగదీశ్వర్, మహిళా ఉపాధ్యక్షులుగా వరలక్ష్మి, కార్యదర్శులుగా గంగాధర్, కృష్ణమోహన్, రాజేశ్వర్, వేణుమాధవరావు, నంబి శ్రీనివాస్, మహిళా కార్యదర్శిగా సుధాకర్‌లు ఎన్నికయ్యారు. వీరు ఆదివారం రాత్రి ప్రమాణస్వీకారం చేశారు.

రోగులకు మెరుగైన వైద్య పరీక్షలు అందించాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మ శరత్ రెడ్డి



బోధన్‌లో డయాగ్నోస్టిక్ సెంటర్‌ను పరిశీలిస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,సెప్టెంబరు 16: రోగులకు మెరుగైన వైద్య పరీక్షలు నిర్వహిస్తేనే సరైన వైద్యం అందుతుందని, రోగులకు మెరుగైన వైద్య పరీక్షలు చేయాలని బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మ శరత్ రెడ్డి అన్నారు. సోమవారం బోధన్ పట్టణంలోని ఐవీపాత్ డయాగ్నోస్టిక్ పరీక్ష కేంద్రాన్ని ప్రారంభించారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్య పరీక్షలు నిర్వహించి రోగనిర్ధారణ చేస్తేనే దాని ప్రకారం వైద్యులు వైద్యం అందిస్తారన్నారు.దీని వల్ల ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బోధన్ మార్కెట్ కమిటీ చైర్మన్ అంకు సంధ్య దాము, ఏసీపీ శ్రీనివాస్, కౌన్సిలర్ శరత్‌రెడ్డి,దాము, పిట్ల సత్యం, శ్రీనివాస్‌గౌడ్, ఆసుపత్రి ఇన్‌చార్జీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుమంత్, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా జరగడానికి చర్యలు తీసుకోవాలి

- చివరి రోజున భక్తులు గణనాథునికి ఘనమైన పూజలు
- శోభాయాత్రకు ముస్తాబైన సార్వజనిక్ రథం
- నేడు విఘ్నేశ్వరుని నిమజ్జనోత్సవం : అడిషనల్ కలెక్టర్ కిరణ్ కుమార్



యంచ వద్ద నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్



గడ్కోల్లో వినాయకుడిని నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు



'ఆంధ్రజ్యోతి' యూనిట్ కార్యాలయంలో నిర్వహించిన వేలంలో గణేష్ లడ్డూను దక్కించుకున్న ఎలక్ట్రికల్ సిబ్బంది మహేష్

నవీపేట,సెప్టెంబరు 16: మంగళవారం జరిగే గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా జరిగే విధంగా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని అడిషనల్(రెవెన్యూ) కలెక్టర్ కిరణ్ కుమార్ కోరారు. సోమవారం మండలంలోని యంచ గోదావరి వద్ద జరుగుతున్న గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శోభాయాత్ర వెళ్లే మార్గంలో రోడ్లపై గుంతలు లేకుండా చూడాలని గోదావరి వద్ద ఫ్లడ్ లైట్లు, సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు భారీ సైజు క్రేన్‌లను అందుబాటులో ఉంచాలని కోరారు. అలాగే ముందు జాగ్రత్త చర్యగా గజ ఈతగాళ్లను సిద్దంగా ఉంచాలని,భక్తులకు తాగునీటి వసతి, మెడికల్ క్యాంప్‌లను అందుబాటులో ఉంచాలని సూచించారు. అంతకు ముందు మండల పరిషత్ కార్యాలయంలో గణేష్ నిమజ్జనానికి సంబంధించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటరమణ, ఎంపీడీవో నాగనాథ్, ఎస్‌ఐ వినయ్, ఎంపీవో రామకృష్ణ, ఆర్ అండ్ బీ డీఈ రాంమోహన్, ట్రాన్స్‌కో ఏఈ ప్రవీణ్ కుమార్, మండల పరిషత్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ దేవిసింగ్, తదితరులున్నారు.

నిజామాబాద్ కల్చరల్/ఖిల్లా: గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని గణనాథునికి భక్తులు ఘనమైన పూజలు నిర్వహించారు. సోమవారం చివరిరోజు కావడంతో భక్తులు విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు గరిక, హోమాలు జరిపారు. 11 రోజుల పాటు వివిధ పూజలు అందుకున్న గణనాథుడు చివరి రోజు భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకొని పూజించారు. జిల్లా కేంద్రంలోని వెయ్యికి పైగా గణనాథుని మండపాలలో 11 రోజుల పాటు ప్రత్యేక పూజలు జరుగగా కొన్ని మండపాలలో ప్రత్యేకతను సంతరించుకునే విధంగా గణనాథున్ని కొలిచారు. ఆలయాలు, మండపాలలో 11 రోజుల పాటు భజనలు, భక్తిగీతాలతో హోరెత్తాయి. గణపతి మండపాలలో భక్తులు గణనాథున్ని దర్శించుకోవడంతో పాటు లడ్డూను వేలంలో దక్కించుకోవడానికి పోటీ పడ్డారు.

● నేటితో ముగియనున్న ఉత్సవాలు

గణనాథునికి 11 రోజుల పాటు నిర్వహించిన పూజలు మంగళవారంతో ముగియనున్నాయి. బాద్రపద చవితి రోజు ప్రారంభమైన ఉత్సవాలు 11 రోజుల పాటు వైభవంగా సాగాయి. గణనాథున్ని గంగమ్మ ఒడికి చేర్చడానికి ఆయా మండపాల నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. జిల్లా కేంద్రంలో ఎంతో వైభవంగా సాగే సార్వజనిక్ రథాన్ని సార్వజనిక్ కమిటీ సిద్ధం చేసింది. గణనాథుని నిమజ్జనోత్సవానికి నగర అధికార యంత్రాంగం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. మంగళవారం మధ్యాహ్నం 2గంటలకు దుబ్బ చౌరస్తా నుంచి ప్రారంభమయ్యే రథయాత్ర శివాజీ చౌక్, రైల్వేగేట్, గంజ్, నెహ్రూపార్క్, బోధన్ బస్టాండ్, బర్కత్‌పురా, గురుద్వారా, పెద్దబజార్, ఆర్యసమాజ్, గోల్‌హనుమాన్, పూలాంగ్ చౌరస్తా మీదుగా వినాయక బావి వరకు శోభాయాత్ర సాగనుంది.

● భారీ బందోబస్తు మధ్య నేడు వినాయక నిమజ్జనం

వినాయక నిమజ్జన శోభాయాత్రకు పోలీసు శాఖ భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది. వివిధ కేటగిరిల 700 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసింది. శోభాయాత్ర జరిగే ప్రాంతాల్లో 60 సిసి కెమెరాలను ఏర్పాటు చేసింది. పోలీస్ శాఖ ఏర్పాటు చేసిన సిసి కెమెరాలతో పాటు పలువురు ప్రైవేటు వాణిజ్య వ్యాపారస్తులు తమ తమ సముదాయాల ఎదుట సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకున్నారు. ఎటువంటి అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ శాఖ నిఘా పెట్టింది. పోలీస్ కమీషనర్ కల్మేశ్వర్ సింగనెవార్ ఆదేశాలతో అదనపు డిసిపి, నిజామాబాద్ ఏసిపిల పర్యవేక్షణలో ఈ శోభాయాత్ర సజావుగా జరిగేందుకు అన్ని చర్యలు చేపట్టారు. సమస్యాత్మక ప్రాంతాల్లో గట్టి నిఘా ఏర్పాటు చేశారు. అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తులను గుర్తించేందుకు మఫ్టీలో సిబ్బంది పర్యవేక్షించనున్నారు. ప్రజలు కూడా ప్రశాంత వాతావరణంలో ఈ నిమజ్జన శోభాయాత్రను జరుపుకోవాలని సిపి కల్మేశ్వర్ సింగనెవార్ సూచించారు. 8 ఫీట్ల పైగా ఉన్న గణేష్ విగ్రహాలను ఉమ్మెడ వద్ద గల గోదావరి నదిలో, బాసర బ్రిడ్జి వద్ద నిమజ్జనం చేయాలని ఇప్పటికే సూచించడం జరిగిందని తెలిపారు. ఉత్సవ కమిటీ సభ్యులు సైతం పోలీస్ శాఖ ఆదేశాలను పాటిస్తూ సమన్వయంతో నిమజ్జన కార్యక్రమాన్ని పూర్తి చేయాలని పోలీస్ శాఖ కోరింది.

ధర్పల్లి: మండల కేంద్రంలోగల జికె యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుంకుమార్చన కార్యక్రమంలో మహిళలు సోమవారం పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సారిక హన్మంత్‌రెడ్డి కుంకుమార్చనలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. గణేష్ మండపాలకు గణనాథులను తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. మంగళవారానికి 11 రోజులు కావడంతో గణేష్ ప్రతిమలు నిమజ్జనానికి తరలనున్న నేపథ్యంలో చివరి రోజు కావడంతో చూసేందు కు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివెళ్తున్నారు. గణేష్ మండపాలను విద్యుత్ దీపాలతో అలంకరించి ఆకర్షణీయమైన డెకరేషన్‌లతో తీర్చిదిద్దారు.

ఆర్మూర్‌రూరల్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని కొటార్మూర్‌లో హిందు యూత్ గణేష్ మండపం వద్ద సోమవారం అత్యంత భక్తిశ్రద్దలతో మహిళలు కుంకుమార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి కుమార్తె, ఆర్ఆర్ ఫౌండేషన్ డైరెక్టర్ పైడి సుచితరెడ్డి పాల్గొని గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు అంకాపూర్ సురేష్‌రెడ్డి, సంజీవరెడ్డి, గుడిరెడ్డి సంఘ సభ్యులు ఇట్టెడి మోహన్‌రెడ్డి, కొప్పెల అచ్చిత్‌రెడ్డి, లోక రాజమణి, సరోజన, శోభ, లలిత, పద్మ,కవిత, అనిత,రజిత, తదితరులు పాల్గొన్నారు.

భీమ్‌గల్:పట్టణంలోని వినాయక ఉత్సవాల సందర్భంగా విగ్రహాల నిమజ్జనం చేసే చెరువులను సోమవారం మున్సిపల్ కమిషనర్ వై.రామకృష్ణ చైర్మన్ కన్నె ప్రేమలత సురేందర్, సీఐ నవీన్‌కుమార్‌లు పరిశీలించారు. నిమజ్జనం చేసే చెరువు వద్ద తీసుకోవాల్సి జాగ్రత్తలను సిబ్బందికి వివరించారు. చెరువు ప్రాంతంలో లైట్లు ఏర్పాటుతో పాటు గజ ఈతగాళ్ల నియామిస్తున్నామని, భారీ విగ్రహాల కోసం క్రేన్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఉత్సవాల్లో ఎలాంటి ప్రమాదాలు వాటిల్లకుండా ఉండేలా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వీరి వెంట విద్యుత్ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది శ్రీనివాస్‌రెడ్డి, పల్లికొండ శ్రీధర్, సున్నపు ఓంకార్, తదితరులు ఉన్నారు.

వేల్పూర్: తొమ్మిది రోజుల పాటు పూజలు అందుకున్న గణనాథుడికి సోమవారం సాయంత్రం ఘనంగా వీడ్కోలు పలికారు. మండలంలోని తొమ్మిది రోజుల పాటు గణేష్‌కు భక్తిశ్రద్దలతో పూజలు నిర్వహించి నిర్వాహకులు బొజ్జ గణపయ్యకు విడ్కోలు పలుకుతూ భజన కీర్తనలతో ఊరేగింపుగా తీసుకువెళ్ళి స్థానిక చెరువుల్లో నిమజ్జనం చేశారు. తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్దలతో ఉదయం, సాయంత్రం ప్రత్యేక నిర్వహించి సోమవారం నిమజ్జనోత్సవం ఘనంగా నిర్వహించినట్టు నిర్వాహకులు తెలిపారు. ప్రధాన వీధులగుండా భక్తిశ్రద్దలతో శోభయాత్ర కన్నుల పండుగగా కొనసాగింది. ఈ సందర్భంగా ఏలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

డిచ్‌పల్లి: వినాయక ఉత్సవాల్లో భాగంగా గణనాథులకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. సోమవారం పదవ రోజు అమృతా పూర్ గ్రామంలో యువ ఆదర్శ గణేశ్ మండపంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ధర్మారం గ్రామంలో వైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేశ్ మండపంలో మహిళలు వినాయకుడికి దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. ఘన్ పూర్ లో గణేశ్ విగ్రహనికి నిమజ్జనంకు బయలుదేరాయి.

సిరికొండ: పదిరోజులుగా ఎంతో భక్తి శ్రద్ధలతో పూజించిన వినాయకులను సోమవారం గడ్కోల్, సిరికొండ గ్రామాల్లో వినాయకులను నిమజ్జనం చేశారు. గడ్కోల్ గ్రామంలో కొన్ని వినాయక మండపాలకు చెందిన బొజ్జ గణపయ్యలను సోమవారం శకటాలను శోభాయమానంగా తయారు చేసి భక్తి శ్రద్ధలతో భజనలు చేస్తూ, డ్యాన్సులు చేస్తూ నిమజ్జనానికి తరలించారు. వినాయకులను నీటిలో నిమజ్జనం చేశారు.సిరికొండలో శివపుత్ర మండలి వినాయకుడిని మహిళలు కోలాటాలు వేస్తూ పాటలు పాడుతూ ఆనందంగా నిమజ్జనానికి తరలించారు. ఎల్లమ్మ చెరువులో నిమజ్జనం చేశారు.

ముప్కాల్: మండలంలో వాడవడలా గణేష్ మండపాల వద్ద అధిక సంఖ్యలో భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు పాల్గొని తమ పాడిపంటలు బాగుండాలని ఆయురారోగ్యాతో సల్లంగా ఉండాలని వినాయకుని పూజించి వేడుకున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో సోమవారం చైతన్య యూత్ అంబేద్కర్ చాలెంజ్ ప్రెండ్స్ యూత్ యువజన సంఘాల ఆధ్వర్యంలో సోమవారం గణేష్ మండపాల వద్ద అన్నదాన సత్రాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



భీమ్‌గల్‌లో చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్



వేల్పూర్‌లో గణేష్ నిమజ్జన శోభాయాత్ర నిర్వహిస్తున్న గ్రామస్థులు



ధర్పల్లి కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన చైర్‌పర్సన్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ఆర్మూర్‌లో గూండ్ల చెరువును పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబరు16: పట్టణంలోని గూండ్లచెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లను సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య శ్రీనివాస్, కమిషనర్ రాజులు పరిశీలించారు.చీకట్లో గణేష్ నిమజ్జనం అనే శీర్షికను సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి స్పందించిన మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య పలువురు అధికారులతో గూండ్ల చెరువుతో పాటు మామిడిపల్లి,పెర్కిట్‌లలో గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. తక్షణమే భారీ కెడ్లు, లైట్లను ఏర్పాట్లు చేయాల్సిందిగా అధికారులను ఆదేశించడంతో పనులను చేపడుతున్నారు. ఆమె వెంట కౌన్సిలర్‌లు ఆకుల రాము, శాల ప్రసాద్, ఫయాజ్, జహీర్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, పౌర్ణమౌళి, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి హ్యుందాయ్ న్యూ బోల్డ్ అల్కాజర్



హ్యుందాయ్ న్యూ బోల్డ్ అల్కాజర్ వాహనాన్ని విడుదల చేస్తున్న దృశ్యం

నిజామాబాద్‌అర్బన్, సెప్టెంబరు 16: హ్యుందాయ్ మోటార్స్ ఇండియా తాజాగా ద న్యూ బోల్డ్ అల్కాజర్ వాహనాన్ని మార్కెట్‌లోకి విడుదల చేసింది. సోమవారం నగర శివారులోని ప్రకాష్ హ్యుందాయ్ షోరూంలో ఎండి నల్ల దినేష్‌రెడ్డి నూతన వాహనాన్ని విడుదల చేశారు. ఎందరో కస్టమర్ల మన్నలను పొందిన అల్కాజర్ కారును సరికొత్తగా అత్యాధునిక టెక్నాలజీని పొందుపరుస్తూ ద బోల్డ్ న్యూ సరికొత్త హ్యుందాయ్ అల్కాజర్ అడ్వాన్స్‌డ్ డ్రైవర్-అసిస్టెంట్స్ సిస్టమ్స్ ఫీచర్స్‌తో ఈ వాహనాన్ని రూపొందించడం జరిగిందన్నారు. 1.5 లీటర్ల టర్బో జీడీ ఐ పెట్రోల్ వేరియంట్ ప్రారంభ ధర రూ.14.99 లక్షలు (ఎక్స్ షోరూం ఢిల్లీ), డీజిల్ వేరియంట్ ప్రారంభ ధర రూ.15.99 లక్షల నుంచి ప్రారంభమవుతుందని ప్రీమియం 6 మరియు 7 సీటర్స్ ఎస్‌యువి విశాలమైన మరియు ఎత్తైన వైకరిని కలిగి ఉంటూ సౌకర్యంతో పాటు భద్రత అంశాలలో వినియోగదారులకు సరికొత్త అనుభవాలను పంచేలా ఈ వాహనాన్ని రూపొందించడం జరిగిందన్నారు. ఏడు సరికొత్త ఆకర్షణీయమైన రంగులలో ఈ వాహనం లభ్యమవుతుందన్నారు. అల్కాజర్‌ను ప్రోత్సహించిన విధంగానే ఈ వాహనాన్ని కూడా వాహన ప్రేమికులు ఆధరించాలన్నారు. ఈకార్యక్రమంలో మేనేజర్ వినోద్, నితిన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నటేశ్వరశర్మ సాహిత్య సేవలు మరువలేనివి



నటేశ్వరశర్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

మోపాల్, సెప్టెంబరు 16: డాక్టర్ ఆయాచితం నటేశ్వర శర్మ సాహిత్య సేవలు సమాజానికి ఎంతో ఉపయోగకరమైనవని ఆయన అడుగు జాడల్లో నడుచుకోవాలని పలువురు వక్త కవులు పేర్కొన్నారు. సోమవారం మల్లీనాథ శ్రీ కళా పీఠం ఏడుపాయల సంస్థాన్ నిజామాబాద్ శాఖ ఆధ్వర్యంలో నగరంలోని బోర్గాం(పి) గ్రామ సమీపంలో ఉన్న లక్ష్మి గణపతి ఆలయ ప్రాంగణంలో డాక్టర్ నటేశ్వర శర్మ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. జాతీయ వ్యవస్థాపకులు డాక్టర్ దృశ్యకవి అమరుకుల చక్రవర్తి మాట్లాడుతూ జీవన సాహిత్యాన్ని జీవన సరళిని గురించి ప్రస్థావించారు. వారి సాహిత్య సేవలు మరువలేనివని అన్నారు. జాతీయ కార్యవర్గ అధ్యక్షుడు వెంకటకవి మాట్లాడుతూ సాహితీ శ్రేష్ఠయని జ్ఞాన విజ్ఞాన ప్రజ్ఞాని అని సమాజానికి వారి రచనలు భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. బ్రహ్మర్షి అరుణ్‌కుమార్ శర్మ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాహిత్య అనుబంధాన్ని గుర్తు చేశారు. మల్లీనాథ సూరి కళాపీఠం నిజామాబాద్ శాఖ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శులు పేరం సంధ్యారాణి, సాయిలు టేకుర్ల మాట్లాడుతూ జిల్లా సాహిత్య అనుబంధం నటేశ్వర శర్మతో ఉన్నటువంటి అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ప్రతీ ఒక్కరు ఆయన మార్గదర్శకంలో నడుచుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో నరేష్‌రావు, కృష్ణారెడ్డి, ప్రవీణ్‌కుమార్, విజయలక్ష్మి, అరుణ్,సత్యనారాయణ, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.85	రూ.200	రూ. 220
వెన్‌కాబ్(కిలో)	: రూ.95	రూ.205	రూ. 225

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.75100	రూ.69300	రూ.900

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : ప్రేమికుడు (10.00)
: మత్తు వదలరా (1.30, 7.45, 10.45)
: స్త్రీ-2 (4.30)

స్క్రీన్-2 : ఏఆర్ఎం (తెలుగు 3డి) (12.15, 7.00)
: సరిపోదా శనివారం (3.25, 10.10)

స్క్రీన్-3 : భలే ఉన్నాడే (10.25, 7.30)
: 35-చిన్నకథ కాదు (1.25, 10.30)
: మత్తు వదలరా (4.30)

స్క్రీన్-4 : ఉత్సవం (11.00, 7.15)
: తుంబ్బడ్ (హిందీ) (2.00)
: కళింగ (4.40)
: ది గోట్ (తెలుగు) (10.15)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : 3 (తెలుగు) (10.20)
: సరిపోదా శనివారం (1.25, 7.20)
: 35-చిన్నకథ కాదు (4.35, 10.30)

స్క్రీన్-2 : ఏఆర్ఎం (తెలుగు 3డి) (4.20)
: 3 (తెలుగు) (7.30, 10.30)

స్క్రీన్-3 : 35-చిన్నకథ కాదు (10.50, 1.50)
: 3 (తెలుగు) (4.35)
: మత్తు వదలరా (7.40)

దేవి : మత్తు వదలరా (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : ఉరుకు పటేలా (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : ఏఆర్ఎం (తెలుగు) (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహాల్ : సరిపోదా శనివారం (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్